క్లుప్తంగా

3 నుంచి దేవీ శరన్నవరాత్రులు



సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల వద్ద ఉన్న త్రిశక్తి దుర్గా పీఠం నందు అక్టోబర్ 3 నుంచి 12 వరకు దేవి శరన్నవరాత్రి 18వ మహోత్సవాలు జరుగుతాయని పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామీజీ శుక్రవారం తెలిపారు. 3న బాలా త్రిపుర సుందరి, 4న త్రినయని దుర్గ, 5న గాయత్రీ దేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న లలితా త్రిపుర సుందరి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతి దేవి, 10న దుర్గా దేవి, 11న మహిషాసురమర్దిని, 12న శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకరణలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం 9:30 గంటలకు కల్యాణం, శ్రీ చక్ర మేరువ లకు సామూహిక కుంకుమార్చన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలన్నీ కలవ కొలను సీతారామశాస్త్రి (రాము) ఆధ్వర్యంలో జరుగుతాయని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

రేపు ఘంటసాల కళా పరిషత్ నాటకోత్సవాలు

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడివద్ద ఘంటసాల కళా పరిషత్ 19 వ వార్షిక నాటకోత్సవాలు ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరగనున్నాయని ఘంటసాల కళా పరిషత్ బాధ్యులు శుక్రవారం తెలిపారు. నాటకోత్సవాల్లో విశిష్ట అతిథిగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ పాల్గొంటారన్నారు. బి.బాలరాజు ఘంటసాల పాటల సంగీత విభావరి, తుళ్లూరు కళాపరిషత్ వారి 'మౌనం','త్యాగం' నాటికలు, ఉషోదయ కళా పరిషత్ వారి 'హాస్య వల్లరి'(జబర్దస్త్) ప్రదర్శించబడుతుందన్నారు. అలాగే శ్రీకృష్ణ రాయబారంలోని 'పడక సీను' శాతవాహన కళా నిలయం వారు ప్రదర్శిస్తారని చెప్పారు.

రేపు మెగా జాబ్ మేళా

సత్తెనపల్లి: సత్తెనపల్లి రఘురామ్‌నగర్‌లోని ప్రజా వేదికలో ఆదివారం ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే తాను స్వయంగా కంపెనీలతో చర్చించి, నియోజకవర్గానికి తీసుకొని రావడం జరిగిందన్నారు.

నేడు వేల్పూరులో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

అచ్చంపేట : మండలంలోని వేల్పూరు జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో శనివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు పురస్కరించుకుని గురుపుజోత్సవాలు జరుగుతాయని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఆళ్లమూడి వెంకటేశ్వరరావు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు హాజరవుతారన్నారు.

చుక్కల భూముల పరిశీలన

అచ్చంపేట: ఫ్రీ హోల్డ్ చేసిన చుక్కలు, అసైన్డ్ భూముల వివరాలను స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఆర్.కుముదిన్ సింగ్ శుక్రవారం గింజుపల్లి, పెదపాలెం, ఓర్వకల్లు గ్రామాల్లో రీ-వెరిఫికేషన్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు జి.శ్రీనివాస యాదవ్‌తో చర్చించారు. చుక్కల భూముల రీ-వెరిఫికేషన్‌పై వీఆర్వోలకు తగు సూచనలిచ్చారు.

రోడ్ల నిర్మాణానికి సీపీఎం మహా సభ తీర్మానం

క్రోసూరు: తాళ్లూరు, ఉయ్యందన, అనంతవరం గ్రామాలకు వెళ్లే రోడ్లను వెంటనే ప్రారంభించాలని సీపీఎం తాళ్లూరు శాఖ మహా సభ శుక్రవారం తీర్మానం చేసి, ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మహా సభ తోట చుక్కయ్య అధ్యక్షతన కొరివి అన్నపూర్ణమ్మ ఇంటిలో జరిగింది. తాళ్లూరు, ఉయ్యందన గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మహా సభ తీర్మానం చేసింది. సభలో చర్చించిన విషయాలను పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు వెల్లడించారు. తాళ్లూరు నుంచి కందులూరిపాలెం రోడ్డు నిర్మించాలని కోరారు. సాగు నీరు అందిస్తున్న చెక్ డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టాలన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు మల్లేశ్వరి, మండల కార్యదర్శి హనుమంతరావు, శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, బాలయ్య, అన్నపూర్ణమ్మ, పొత్తూరి పానయ్య, అత్తోట వెంకట అప్పారావు పాల్గొన్నారు.

అంతర పంటలతో తెగుళ్ల నివారణ

రాజుపాలెం: మిరపలో అంతర పంటలుగా బంతి, ముల్లంగి, ఉల్లి, కొత్తి మీర, ఆముదం, పసుపుతో పాటు లింగార్షక బుట్టలు, బ్లూ కలర్ జిగురు పూసిన అట్టలు ఉంచితే నల్ల తామర, లద్దె పురుగులు, పచ్చ, తెల్ల దోమల ఉధృతిని అరికట్టవచ్చని ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఎం.అమలకుమారి తెలిపారు. గణపవరం, రెడ్డిగూడెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన మిరప పంటలను శుక్రవారం పరిశీలించారు. జిల్లా యాంకర్ రామచంద్రం, ఎంటీ జయలక్ష్మి, యూనిట్ ఇన్‌చార్జిలు జ్యోతి, రమణయ్య, శ్రీనివాసరెడ్డి, రైతులు శివారెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

వంద శాతం ఫెయిల్యూర్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులవుతోంది. ఇన్ని రోజుల్లో సత్తెనపల్లి నియోజకవర్గంలో ఒక అభివృద్ధి అడుగైనా పడిందా అంటే ప్రశ్నార్థకం, ఆశ్చర్యార్థకమే. 'సూపర్ సిక్స్'ను ఎలా అయితే సీఎం గాలికొదిలేశారో.. స్థానిక హామీలను అలాగే విస్మరించారు పాలకులు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ హామీల ప్రస్తావన కూడా చేయని పరిస్థితి నెలకొంది. అధికారం దక్కింది... ఇక మనం చేయాల్సింది ఏమీ లేదు అన్నట్లే ఉంది వారి విధానం. తమ వైపు నాలుగు వేళ్ల తిరిగి హామీల అమలెప్పుడని నిలదీస్తుంటే.. అది మరచి గత ప్రభుత్వం ఏమీ చేయలేదంటూ వేలెత్తి చూపే పద్ధతికి కూటమి నాయకులు స్వస్తి చెప్పలేకపోతున్నారు.

కూటమి ప్రభుత్వంలో సంక్షేమం తిరోగమనం

- వంద రోజుల్లో ఒక అభివృద్ధి అడుగూ పడని వైనం
- ఇక సత్తెనపల్లి నియోజకవర్గ హామీలు హుళక్కే..
- అభివృద్ధి, సంక్షేమం రెండూ లేక ప్రజల అంతర్మథనం

సత్తెనపల్లి: చంద్రబాబుకు అధికారం ఇచ్చి పొరపాటు చేశామని రాష్ట్ర ప్రజలతో పాటు సత్తెనపల్లి నియోజకవర్గ వాసులు పశ్చాత్తాప పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన పాలకులు..

ఇప్పుడు మళ్లీ అమరావతిలో రాజధాని నిర్మిస్తామని చెబుతున్నారు. సరైన వర్షాలు కురిస్తే.. పై నుంచి వరదలు ముంచెత్తితే.. అక్కడ ముంపు పరిస్థితి ఏమిటో ఇటీవల తేటతెల్లమైంది.

- నదుల అనుసంధానం కూటమి ఎన్నికల ప్రణాళికలో ముఖ్యమైన అంశం. గోదావరి జలాలను పల్నాడు ప్రాంతానికి తీసుకువచ్చి సత్తెనపల్లి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. ఇంత వరకు ఒక్క అడుగు కూడా పడలేదు.
- ధరలు తగ్గిస్తామన్న ప్రభుత్వం ఆ వైపు చూడలేదు. ఉప్పు, పప్పు, నూనె, కూరగాయలు ఇలా ఏ ఒక్కటి పట్టుకున్నా ధరలు మండిపోతున్నాయి. పేదల పక్కా గృహాల బిల్లులు నిలిపివేశారు. టిడ్కో గృహాల పై సమీక్ష తప్ప అమలుకు ఆచరణ లేదు.



అలంకార ప్రాయంగా స్టేడియం



ఎన్నికల ముందు కన్నా లక్ష్మీనారాయణ ఇంటర్వ్యూ



పేదల దరి చేరని టిడ్కో గృహ సముదాయం



వర్షపు నీరు సగం మునిగిన షాదీఖానా

ముస్లిం సోదరులను అన్ని విధాల ఆదుకుంటామని కూటమి నేతలు ప్రకటనలు చేశారు. స్థానిక షాదీ ఖానా భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేస్తామన్నారు. ఇటీవల వర్షానికి భవనంలో నిలిచిన నీటిని తొలగించడం గానీ, పగిలిన అద్దాలకు మరమ్మతులు చేయించడం జరగలేదు. మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో ముస్లిం సోదరులకు కేటాయించిన స్థలంలో మసీదు నిర్మాణానికి శంకు స్థాపన చేశారు.

నియోజకవర్గంలో నడికుడి-శ్రీకాళహస్తి రైలు మార్గం అభివృద్ధి లేదు. మేజర్ స్టేడియం, పీఆర్ అతిథి గృహం, ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల అదనపు గదులు, కేంద్రియ విద్యాలయానికి దారి, లోలెవల్ చప్టాలను హై లెవెల్ బ్రిడ్జిలుగా మార్చడం, తారక రామాసాగర్‌ను పర్యాటక అభివృద్ధికి చొరవ.. ఇలా ఒక్కటి జరిగితే ఒట్టు.



వెలవెలబోతున్న తారక రామా సాగర్

కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారి విస్తరణ అతీగతి లేదు. గత ప్రభుత్వంలోనే ఈ రహదారిని జాతీయ రహదారిగా మార్చడంతో పాటు భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసింది. ప్రస్తుతం టెండర్ల దశలో ఉంది. అలాగే తొండపి, పాకాలపాడు ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు నోచుకోలేదు. సత్తెనపల్లి- మాదిపాడు రహదారిలో రైల్వే గేటు వద్ద, అనుపాలెం లెవెల్ చప్టా పై హైలైన్ లో బ్రిడ్జి నిర్మాణానికి కనీసం ప్రతిపాదనలు లేవు. ఇటీవల వర్షాలకు, వరదలకు గుంటూరు-హైదరాబాదు మార్గంలోని వాహనాలు నిలిచిపోయి.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



వర్షానికి పొంగిన అనుపాలెంలో లెవల్ చప్టా పైగా వాహనం(ఫైల్)

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ దాడి

సత్తెనపల్లి: పాతకక్షల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు .. కొమెరపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ, టీడీపీకి చెందిన ముస్లిం వర్గాలు మేడికొండూరు మండలం రాయల గ్రామంలో ఓ వివాహానికి హాజరయ్యేందుకు వెళ్లారు. అక్కడ ఇరు వర్గాల మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. అక్కడి నుంచి తిరిగి కొమెరపూడి గ్రామానికి చేరుకున్న అనంతరం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మందులపాలెం నూరుల్లా, మందులపాలెం మహబూబ్ సుభాని, మందులపాలెం బుడాతోపాటు మరికొందరిపై టీడీపీకి చెందిన మధిర నజీర్, మధిర సుభాని తదితరులు దాడికి పాల్పడ్డారు. దీంతో వైఎస్సార్ సీపీకి చెందిన ఏడుగురికి, టీడీపీకి చెందిన ఇరువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరోగ్యమే మహా భాగ్యం



అచ్చంపేట: గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా మండలంలోని తాళ్ల చెరువులో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గర్భిణులు రోజులో కొంత సమయం యోగా చేయడం ద్వారా మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని, నార్మల్ డెలివరీ అవకాశం ఉంటుందని తెలిపారు. ఆకు కూరలలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని వాటిని తరచూ తింటూ ఉండాలన్నారు. బాలింతలు బిడ్డకు తప్పనిసరిగా పాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గాదె ఇన్నారెడ్డి, తుమ్మా విజయ సుధాకర్‌రెడ్డి, సచివాలయ ఎన్ఎం ఎం.సుశీల, మహిళా పోలీస్ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్పీ హనుమంతరావుకు సత్కారం




డీఎస్పీని సత్కరిస్తున్న సమాఖ్య నాయకులు

సత్తెనపల్లి: సత్తెనపల్లి డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మేదరమెట్ల హనుమంతరావును శుక్రవారం జిల్లా వాసవి సేవా సమితిల సమైఖ్య, సత్తెనపల్లి వాసవి సేవా సమితి, పట్టణ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ నాయకులు వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. సమైఖ్య వ్యవస్థాపకులు చీతిరాల గురు పెద్దన్న, సత్తెనపల్లి అధ్యక్షుడు దేవరశెట్టి రవి కుమార్, కోశాధికారి లఘువరపు రమేష్, జిల్లా విద్యా నిధి కమిటీ చైర్మన్ కూరపాటి లక్ష్మిపూర్ణచంద్రరావు, కన్వీనర్లు దుర్గారామ్ ప్రసాద్, జగదీష్ కుమార్, ఆర్యవైశ్య సంఘ జిల్లా నాయకుడు అప్పారావు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోటగిరి పోతులూరయ్య, ఉపాధ్యక్షులు త్నాచారి, కార్యదర్శి దాసు భాస్కరాచారి తదితరులున్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

రాజుపాలెం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు వైద్యుల సూచనలు పాటించాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఉమారాణి తెలిపారు. మండలంలోని కొండమోడు సెక్టారు పరిధిలోని అనుపాలెం గ్రామంలో పోషణ, పౌష్టికాహార మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాలను వివరించారు. సర్పంచ్ సానికొమ్ము వెంకట సుబ్బమ్మ, సీడీపీవో శ్రీలత, ఏసీడీపీవో టి.సంతోషకుమారి, సూపర్‌వైజర్లు స్వర్ణలత, రమాదేవి, ప్రసన్నకుమారి, పీఎస్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రతిభా రివార్డుల ప్రదానం



ఎస్పీ శ్రీనివాసరావు నుంచి రివార్డు అందుకుంటున్న సీఐ బ్రహ్మయ్య



రివార్డు అందుకుంటున్న ఎస్ఐ సంధ్యారాణి

సత్తెనపల్లి: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి, ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు నరసరావుపేటలో శుక్రవారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు రివార్డులు ప్రదానం చేశారు. నేర సమీక్ష సమావేశంలో పాల్గొన్న సత్తెనపల్లి టౌన్ సీఐ బి.బ్రహ్మయ్య, ఎస్ఐ ఎం.సంధ్యారాణి రివార్డులు అందుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్ సిబ్బంది, ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

నకరికల్లు: మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు కుంకలగుంట గ్రామంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 23లోపు ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ-కేవైసీ ప్రక్రియకు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



అమరావతి: మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లలో ఖాళీలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ మేకల హనుమంతరావు తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బీసీ, ఎస్సీ హాస్టళ్ల సలహా సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించి, స్టడీ అవర్లు నిర్వహించాలని వార్డెన్‌లకు సూచించారు. ఎస్సీ హాస్టల్‌లో 85, బీసీ హాస్టల్‌లో 85 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వార్డెన్‌లు రత్నబాబు, బాలాంజలి పాల్గొన్నారు.

పెద్దకూరపాడును ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తా



పెదకూరపాడు: రానున్న రోజుల్లో పెదకూరపాడు నియోజకవర్గాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై శుక్రవారం కాశిపాడు, గారపాడు గ్రామాల్లో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేసి అభివృద్ధి కార్యక్రమాలను అంచలంచెలుగా అమలు చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో పేదరికం, ఆర్థిక అసమానతల తగ్గుదలకు ప్రణాళిక రూపొందించి, అమలు దిశగా పని చేస్తానన్నారు. దీపావళి కానుకగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల ఆట.. భవిష్యత్తు బాట



రాజుపాలెం మండలం గణపవరం పాఠశాలలో కబడ్డీలో తలపడుతున్న బాలికలు

- పాఠశాల క్రీడా సమాఖ్య మండల స్థాయి ఎంపికలు
- అండర్-14, 17 విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొన్న గ్రామీణ క్రీడాకారులు
- రాష్ట్రస్థాయిలో రాణిస్తే విద్యా, ఉద్యోగ అవకాశాల్లో కోటా

సత్తెనపల్లి: పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థులకు ఆటల పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 23 వరకు క్రీడా ఎంపికలు జరుగుతాయి. గ్రామీణ క్రీడాకారులకు తమ ప్రతిభ కనబరిచేందుకు ఇదో చక్కటి వేదిక. మండల స్థాయి నుంచి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు వెళ్లి అవార్డులు, గుర్తింపు పొందేందుకు అవకాశం ఉంది. ఈ మేరకు క్రీడా మైదానాల్లో క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన వారికి క్రీడా కోటాలో ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు పొందేందుకు అవకాశం ఉంటుంది. ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం పొందొచ్చు.

రాజుపాలెం మండల స్థాయి క్రీడా పోటీలు గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాల, నకరికల్లు మండలానికి నకరికల్లు, సత్తెనపల్లి మండలానికి నందిగామ, ముప్పాళ్ళ మండలానికి నార్నెపాడు పాఠశాలల క్రీడా ప్రాంగణాల్లో ఆటల పోటీలు జరుగుతున్నాయి. అండర్-14, 17 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజన సదుపాయం అక్కడే కల్పిస్తున్నారు.

నేడు క్రీడా పోటీలు..

నియోజకవర్గంలో మండల స్థాయిలో శనివారం అథ్లెటిక్స్‌లో ఎంపికలు జరుగుతాయి. నకరికల్లు: అథ్లెటిక్స్, చెస్,యోగా. రాజుపాలెం: అండర్-17 విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, 23న అథ్లెటిక్స్, చెస్, యోగా నిర్వహిస్తారు. సత్తెనపల్లి, ముప్పాళ్ళ మండలాలకు 23న అథ్లెటిక్స్, చెస్, యోగా క్రీడా పోటీలు, మండల జట్ల ఎంపికలు నిర్వహిస్తారు. సత్తెనపల్లిలో 24న ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నారు. సమన్వయకర్తగా నందిగామ వ్యాయామ ఉపాధ్యాయుడు లాకు పిచ్చయ్య వ్యవహరించనున్నారు.

పాఠశాలలు ఇలా..

సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో ప్రాథమికోన్నత పాఠశాలలు 18, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 31 ఉన్నాయి. విద్యార్థులు 13,377 మంది చదువుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాం. విద్యార్థులు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొంటున్నారు. జట్ల ఎంపికలు విజయవంతంగా నిర్వహించేందుకు అందరి సహకారం కోరుతున్నాం.

-ఎ.శ్రీనివాసరావు, ఎంఈఓ, సత్తెనపల్లి

నష్టపోయిన రైతులను ఆదుకోండి

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



పెదకూరపాడు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎకరానికి రూ.15 నుంచి రూ.20 పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులకు వెంటనే ఇన్పుట్ సబ్సిడీ, పంటల బీమా అమలు చేయాలన్నారు. నియోజకవర్గంలో 1,22,900 ఎకరాలు సాగు భూమి ఉండగా అందులో 61,300 ఎకరాల్లో పత్తి, 25 వేల ఎకరాల్లో వరి, కంది, మినుము, పెసర, పసుపు తదితర పంటలు రైతులు సాగు చేశారని తెలిపారు. ముంపుకు గురై సుమారు 40 వేల ఎకరాల వరకు పంటలు పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. ఎన్యుమరేషన్‌లో పలు ఆంక్షలు విధించి కేవలం ఐదు ఎకరాలకే పంట నష్టం వాటిలినట్లుగా అంచనాలు వేశారని, దీనివల్ల వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. నీట మునిగిన ప్రతి ఎకరాకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో హెక్టారుకు రూ. 17 వేలు నష్టపరిహారం చెల్లించినట్లు వెల్లడించారు. పంటల బీమా అమలు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం రకరకాల ఆంక్షలతో కేవలం ఐదువేల ఎకరాల్లోనే నియోజవర్గంలో పంట నష్టం వాటిల్లినట్లు అంచనాల సిద్ధం చేసిందని శంకరావు తెలిపారు. అచ్చంపేట మండలంలో కేవలం 488 ఎకరాలు, బెల్లంకొండ మండలంలో 77 ఎకరాలు, క్రోసూరు మండలంలో 319 ఎకరాలు నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.

పాడిరైతులకు బోనస్ పంపిణీ

బెల్లంకొండ: నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ గ్రామాల్లో సంగం డెయిరీ పాల సేకరణ కేంద్రంలో పాలు పోస్తున్న పాడి రైతులకు బోనస్ శుక్రవారం పంపిణీ చేశారు. మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నాగిరెడ్డి పాలెంలో 120 మంది పాడి రైతులకు రూ. 2,47,064, బెల్లంకొండలో 120 మందికి రూ.1,92,369లు బోనస్ పంపిణీ చేసినట్లు తెలిపారు. మేనేజర్ గోపి, సూపర్ వైజర్లు సాయి, సుధార్, కేంద్రం అధ్యక్షుడు వెన్నా సీతా రామిరెడ్డి పాల్గొన్నారు.